క్లుప్తంగా

పారిశుధ్య కార్మికుల ఆందోళన

పిఠాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గొల్లప్రోలు నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు బుధవారం గొల్లప్రోలులో ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ నాయకులు కె.చిన్న, నందీశ్వరరావు, సీహెచ్‌వీ రమణ తదితరులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని కోరారు. వారి సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు నగర పంచాయతీ పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు నీలా శేషమ్మ, బి.సత్యవతి, సీహెచ్ రామారావు, సింహాచలం, మరిడియ్య, లోవబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటితరం కోసమే వికసిత్ భారత్



వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న ఈఓపీఆర్డీ రాజశేఖర్ తదితరులు

పెద్దాపురం: రేపటితరం భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని రూపొందించిందని మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అన్నారు. కొండపల్లి, ఉలిమేశ్వరం గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత దేశాన్ని రూపొందించాలన్న లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ అమలు చేస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు తోట వెంకట సర్వారాయుడు, జిల్లా నాయకులు విత్తనాల వెంకటరమణ, దువ్వా శ్రీదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు వి.శ్రీనివాస్, శ్రీదేవి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన మహా యాగం



మహాయాగం నిర్వహిస్తున్న భక్తులు

పిఠాపురం: బాపనాచార్యుల మహాన్నదాన ట్రస్టు, అంతర్ యోగ్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో ఈ నెల 23 నుంచి నిర్వహించిన సవిత్ర కాలకాగ్ని మహాయాగం బుధవారం వైభవంగా ముగిసింది. నిర్వాహకులు అల్లం రాజు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో పిఠాపురం రాజావారికోట ఆవరణలో కోట సత్తెమ్మ తల్లి గుడి ఎదురుగా నిర్వహించిన ఈ యాగంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 23న అఖండ సిద్ధ మంగళ స్తోత్ర పారాయణంతో ప్రారంభమైన కార్యక్రమం అభిషేకాలు దిగంబరా దిగంబరా శ్రీపాద వల్లభ దిగంబరా నామ సంకీర్తన పల్లకీ సేవ, నవగ్రహ హోమం, ఆయుష్ హోమం, అశ్వమేథ, అచిత్ర పారాయణం నిర్వహించారు.

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ పింఛను కానుక పెంపుదలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు వచ్చే నెల మూడో తేదీన కాకినాడ విచ్చేస్తున్నందున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో ఆర్పీలు, ప్రత్యేకాధికారులతో, నగరపాలక సంస్థ కార్యాలయంలోని వివిధ విభాగాధిపతులతో ఈ అంశంపై సమీక్షించారు. సామాజిక పింఛను పెంపు కార్యక్రమాన్ని స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో సీఎం ప్రారంభిస్తారన్నారు. అలాగే ముత్తా గోపాలకృష్ణ వారధి, రాగిరెడ్డి కళాక్షేత్రం, స్కేటింగ్ రింక్‌లను కూడా సీఎం ఆ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారన్నారు. సీఎం సభకు పింఛను దారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరయ్యేలా ఆయా డివిజన్ల ప్రత్యేకాధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నగరపాలక సంస్థ తరఫున చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రారంభోత్సవాలకు సంబంధించి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో నగరపాలకసంస్థ ఎస్ఈ సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈలు మాధవీ, వెంకట్రావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, ఏఓ శిరీష్, ఇతర అధికారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ప్రగతి పట్టాల పైకి..

- రూపురేఖలు మారుతున్న పిఠాపురం రైల్వే స్టేషన్
- అధునాతన ఆటోమేటిక్ సిగ్నల్ సిస్టం
- విశ్రాంతి భవనాలు, కొత్త టిక్కెట్ కౌంటర్లు
- ప్రయాణికులకు లిఫ్ట్ సౌకర్యం



పిఠాపురం రైల్వే స్టేషన్ కొత్త భవనం



పిఠాపురం రైల్వే స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రైన్ల వివరాలు తెలిపే డిజిటల్ సిస్టం

పిఠాపురం: నిత్యం రెండు వేలకు పైగా ప్రయాణికులు, దేశ విదేశాల నుంచి వచ్చే యాత్రికులు, కిటకిటలాడే భక్తులతో పిఠాపురం రైల్వే స్టేషన్ విరాజిల్లుతోంది. ఇలాంటి అతి ముఖ్యమైన రైల్వే స్టేషన్ దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయింది. దీనిపై దృష్టి సారించిన కాకినాడ ఎంపీ వంగా గీత చొరవతో రైల్వే శాఖ సుమారు రూ.2 కోట్లు కేటాయించింది. దీంతో ఇక్కడ అధునాతన సౌకర్యాలు ఏర్పాటయ్యాయి. దక్షిణ మధ్య రైల్వేలో పిఠాపురం రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతున్న పిఠాపురానికి నిత్యం వందలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. అందుకే ఇక్కడ ప్రధాన రైళ్లకు సైతం హాల్టు కల్పించారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పిఠాపురం రైల్వే స్టేషన్‌కు తాజాగా కొత్త హంగులు దిద్దుతున్నారు.

రైల్వే స్టేషన్‌కు అధునాతన సౌకర్యాలు

ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పిఠాపురం రైల్వేస్టేషన్ ప్రస్తుతం అభివృద్ధిలో దూసుకుపోతోంది. రూ 2 కోట్ల వ్యయంతో ఈ రైల్వే స్టేషన్లో కొత్త టిక్కెట్ కౌంటర్, మహిళలకు ప్రత్యేక విశ్రాంతి భవనాలు, రెండు ఫ్లాట్‌ఫారాలపైనా అధునాతన సిగ్నల్ వ్యవస్థ, ఇండికేటర్లు ఏర్పాటయ్యాయి. మంచినీటి వసతి, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్ రూపురేఖలు మొత్తం మారిపోయేలా అధునాతన భవనాలను నిర్మించారు. త్వరలో వీటిని ప్రారంభించనున్నారు. వీటితో పాటు కొత్తగా ప్రయాణికుల సౌకర్యార్థం లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. దీని పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే దీనిని ప్రారంభించనున్నారు.



పిఠాపురం రైల్వే స్టేషన్‌లో నిర్మిస్తున్న లిఫ్ట్

మరింత అభివృద్ధికి చర్యలు



పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే రూ.2 కోట్ల వ్యయంతో అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని పనులు పూర్తి కావచ్చాయి. త్వరలో వీటిని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం. దీంతో ఏళ్ల తరబడి ఉన్న ప్రయాణికుల సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. పిఠాపురం ఉప్పాడ రైల్వే గేటు ప్రధాన రహదారిలో ఉండడంతో, ఇక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ అనుమతులిచ్చింది. పనులు కూడా ప్రారంభించారు. పిఠాపురం రైల్వే స్టేషన్లో లిఫ్ట్ సౌకర్యంపై రైల్వే శాఖను కాకినాడ ఎంపీ వంగా గీత కోరగా, వెనువెంటనే నిధులు మంజూరు చేయడంతో వాటి పనులూ ప్రారంభమయ్యాయి. త్వరలోనే పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తాం. ఇతర సౌకర్యాలపైనా దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుంటాం.

– రావుల మాధవరావు, జెడ్ఆర్‌యూసీసీ మెంబర్, పిఠాపురం

మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

ఎమ్మెల్యే దొరబాబుకు అంగన్‌వాడీ వర్కర్ల వినతి



ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

పిఠాపురం: తమ సమస్యలపై కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నామని, పరిష్కారం కోసం తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అంగన్‌వాడీ వర్కర్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్ల సమ్మెలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి పిలుపునివ్వగా, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు ఎమ్మెల్యే ఇంటికి చేరుకుని ఆయనతో చర్చించారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని, తమ న్యాయమైన కోర్కెలు తీరేలా ప్రభుత్వానికి తమ బాధలు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. ఈ సమస్యను ఇప్పటికే ప్రభుత్వం పరిశీలిస్తోందని, అయినప్పటికీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు.

సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోండి



సామర్లకోటలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న చైర్‌పర్సన్ అరుణ, సుబ్బారావు

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో అమలు చేస్తున్న సాంకేతిక విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ సందర్భంగా హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన ఏర్పాటైన సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ డిజిటల్ విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు రూ.30 వేల విలువైన ట్యాబ్‌లను అందజేస్తున్నారన్నారు. అలాగే జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక, అమ్మఒడి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే పెద్ద ఆస్తి విద్య మాత్రమేనన్నారు. హెచ్‌ఎం సాయిరామకృష్ణ మాట్లాడుతూ పాఠశాలలో 130 మంది 8వ తరగతి విద్యార్థులకు రూ.39 లక్షల విలువైన కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందజేస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల మరింత అభివృద్ధికి మున్సిపల్ కౌన్సిల్ సహకరించాలన్నారు. ఉపాధ్యాయులు ఏఎల్‌వీ కుమారి, కె.శ్రీనివాసు, సీహెచ్ భద్ర, బేబీ రాణి, వి.రాజు, జి.గోవింద్, కె.అరుణ, కేవీవీ సత్యనారాయణ, కమిటీ సభ్యుడు డి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆరుద్ర నక్షత్ర పూజలు

భక్తులతో పంచారామ క్షేత్రం కిటకిట



ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్ర కావడంతో ప్రత్యేక పూజలు జరిగాయి. పూజలు, అభిషేకాలను తిలకించడానికి తెల్లవారు జాము నుంచి భక్తులు బారులు తీరారు. ఉదయం నుంచే ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు స్వామివారికి అభిషేకాలు చేశారు. పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో తొలిపూజ జరిగింది. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌తో పాటు ఉప ఆలయాల్లో పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఉదయం నుంచి అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట సుబ్బారావు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి, భక్త సంఘ నాయకులు చల్లా సత్తిబాబు, బీవీ రమణ, కౌన్సిలర్ నేతల హరిబాబు, ఆలయ సిబ్బంది భక్తులకు సేవలందించారు.

క్రీడల జోరు.. యువత హోరు

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



చంద్రమాంపల్లిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ



పెద్దాపురంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ సాయిప్రసాద్



సామర్లకోట మండలం అచ్చంపేటలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

పెద్దాపురం: క్రీడా స్ఫూర్తి ఉరకలేసింది.. ఉత్సాహం ఉవ్వెత్తున ఎగసిపడింది.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు రెండో రోజు బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని సచివాలయ స్థాయిలో ఈ క్రీడలు నిర్వహించారు. పెద్దాపురం మహారాణి కళాశాల, లూథరన్ హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కాండ్రకోటలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, చంద్రమాంపల్లిలో ఎంఈఓలు ప్రభాకరశర్మ, చౌదరి ప్రారంభించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంల అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉపయోగపడతాయన్నారు. ఆడుదాం ఆంధ్రా అందరి ఆట అని, ఉత్సాహంగా అంతా భాగస్వాములు కావాలని వైస్ చైర్మన్ సాయిప్రసాద్ అన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు సరికాదని, ఆడుదాం ఆంధ్రాలో క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం సచివాలయ స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ తదితర క్రీడా పోటీలను ఆయా పాఠశాలల క్రీడా మైదానాల్లో వారు ప్రారంభించారు.

సామర్లకోటలో..

సామర్లకోట: సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రారంభించారు. మండలంలోని 21 సచివాలయాలకు సంబంధించి ఆయా పాఠశాలల్లో జరుగుతున్న పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పట్టణంలో పోటీలను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధి ఊబా కెనడీ, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ఎండీవీ ప్రసాద్, మండలంలో పోటీలను ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఎంఈఓ-2 పి.పుల్లయ్య, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు. మండలంలో రెండో రోజు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

మండల స్థాయికి వాకతిప్ప వాలీబాల్ జట్టు ఎంపిక



మండల స్థాయికి ఎంపికైన వాకతిప్ప వాలీబాల్ క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం



కొత్తపల్లి జెడ్పీ స్కూల్‌లో కబడ్డీ పోటీలు

కొత్తపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. ఈ పోటీల్లో భాగంగా బుధవారం వాకతిప్పలో జరిగిన వాలీబాల్ పోటీల్లో వాకతిప్ప జట్టు మండల స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, సర్పంచ్ పాలాని దొరబాబు క్రీడాకారులను అభినందించారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 10 నుంచి జరిగే పోటీల్లో పాల్గొంటారని ఎంపీడీఓ తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన నాగబాబును అభినందిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామారావు

సామర్లకోట: రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన యాతం నాగబాబును మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అభినందించారు. 200, 400, 800 మీటర్ల పరుగు పోటీల్లో నాగబాబు మూడు బంగారు పతకాలు సాధించారు. దీంతో బుధవారం ఆయన్ని కమిషనర్ సత్కరించారు. ఈ సందర్భంగా నాగబాబు విలేకర్లతో మాట్లాడుతూ 2013 నుంచి ఇప్పటి వరకూ జరిగిన వివిధ జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్ పరుగు పందెం, రిలే విభాగాల్లో 60 పతకాలు సాధించానన్నారు. తాను వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ పదోన్నతిపై కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మలేరియా విభాగంలో సబ్ యూనిట్ అధికారిగా పని చేస్తున్నానన్నారు. ఫిబ్రవరి 4 నుంచి ముంబయిలో జరిగే జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

జ్ఞానంతోనే శాంతి, సహనం


– సద్గురువు డాక్టరు ఉమర్ ఆలీషా



పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషాను గజమాలతో సత్కరించిన దృశ్యం

కాకినాడ రూరల్: మానవులు తమ జ్ఞానం ద్వారానే శాంతి, సహనాన్ని పొందగలరని పీఠాపురం విశ్వ విజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి, సద్గురువు డాక్టర్ ఉమర్ ఆలీషా అనుగ్రహ భాషణ చేశారు. వాకలపూడి రామకృష్ణనగర్‌లోని విశ్వవిజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక పీఠం కాకినాడ శాఖ దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సద్గురువు పాదపూజను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తొలుత సద్గురువు ఉమర్ ఆలీషాకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో సన్నాయి మేళం, కోటాటం, తప్పెటగుళ్లతో గుర్రపు బండిపై ఊరేగింపు ద్వారా ఆశ్రమానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పీఠం సభ్యులు ఆయనకు పాదపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, తమ పీఠం ద్వారా ఈశ్వరత్వం బోధిస్తున్నామన్నారు. మానవ జన్మను ప్రతిఒక్కరూ సార్థకం చేసుకోవాలన్నారు. ఆధ్యాత్మిక చిత్తంతో జీవనం సాగిస్తూ, పరులకు సేవ చేయాలన్నారు. అవధాని ఉమామహేశ్వరరావు సద్గురువు విశిష్టతను సభకు వివరించగా, ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ మహిళలు, వలంటీర్లకు ధాన్యపు కురులు, 11 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు అహ్మద్ ఆలీషా, పాషా, హుస్సేన్ షా, పీఠం కన్వీనరు పేరూరి సూరిబాబు, ఏపీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ వాసి వద్ద అరుదైన నాణెం



నాణేన్ని చూపుతున్న మార్ని జానకిరామ్

బోట్‌క్లబ్: శ్రీకృష్ణుడి భక్తురాలైన సంత్ మీరా బాయి 525 జయంతి సందర్భంగా కోల్‌కత టంకశాల రూ.525 విలువతో కూడిన స్మారక నాణేన్ని ముద్రించింది. కాకినాడకు చెందిన ప్రముఖ నాణేల సేకరణ కర్త మార్ని జానకిరామ్ చౌదరి దీనిని సేకరించారు. దీనిని ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా శ్రీకృష్ణ జన్మభూమి మధురలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జానకిరామ్ చౌదరి మాట్లాడుతూ ఈ నాణెం 44 మి.మీ. చుట్టుకొలతతో, 35 గ్రాముల బరువు కలిగి, 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్ లోహాల మిశ్రమంతో రూపొందించినట్టు వివరించారు. నాణేనికి ఒకవైపు వేలాది కీర్తనలు, భజనలు రచించి, గానం చేసిన సంత్ మీరా బాయి చిత్రం, మరోవైపు మన జాతీయ చిహ్నం అశోక స్తంభంపై ఉన్న మూడు సింహాలతో పాటు నాణెం విలువ రూ.525గా ముద్రించారు.

డ్రైవర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ: ఏపీఎస్ఆర్టీసీ నిర్వహణలోని పల్లెవెలుగు బస్సులకు రోజువారీ వేతనంపై పనిచేసేందుకు అర్హత కలిగిన డ్రైవర్లు తమను సంప్రదించాలని డిపో మేనేజర్ ఎంయుపీ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ మోటారు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి, 18 నెలల అనుభవంతో పాటు ఆర్టీఓ కార్యాలయం నుంచి ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వరుసగా వాహనాల ఢీ..

కాకినాడ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం



సామర్లకోట-కాకినాడ రోడ్డులో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ లతాకుమారి

సామర్లకోట: స్థానిక కాకినాడ కెనాల్ రోడ్డులోని బుధవారం ముత్యాలమ్మ ఆలయం సమీపంలో ముందు వెళుతున్న వాహనం ఒకసారిగా బ్రేక్ వేయడంతో వెనుక వరుసగా వస్తున్న వాహనాలు ఒక దానికి ఒకటి ఢీకొన్నాయి. దీంతో కారు, రెండు బస్సులు, లారీ పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ మేరకు వాహనాలను రోడ్డుపై నిలిపి డ్రైవర్లు ఒకరితో ఒకరు ఘర్షణకు దిగడంతో ట్రాఫిక్ స్తంభించింది. సుమారు గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో విధులు ముగించుకుని కాకినాడ వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు ట్రాఫిక్ సమస్యను గమనించి, ప్రయాణికులతో కలసి ట్రాఫిక్ క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు సంఘటనా ప్రదేశానికి చేరుకుని వాహనచోదకులతో చర్చించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

గ్యాస్ వినియోగదారుల పడిగాపులు



సామర్లకోటలో గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన వినియోగదారులు

సామర్లకోట: గ్యాస్ కనెక్షన్లకు వినియోగదారులకు తప్పనిసరిగా ఈకేవైసీ ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. వంట గ్యాస్ వినియోగిస్తున్న వారికి సిలెండర్‌కు రూ.10.62 చొప్పున రాయితీగా వారి బ్యాంకు ఖాతాల్లో పడుతుంది. అయితే ఒకే వ్యక్తికి వేర్వేరు గ్యాస్ కనెక్షన్లతో పాటు చనిపోయిన వారి పేరున కూడా కనెక్షన్లు ఉండటం తదితర వాటిని కేంద్రం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఈకేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే రాయితీ వర్తిస్తుందని ప్రకటించింది. ఈకేవైసీ లేకపోతే గ్యాస్ కనెక్షన్ తొలగిస్తారని వినియోగదారులు అపోహ పడి ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్ద పడిగాపులు పడుతున్నారు. ఈ విషయమై స్థానిక పవన్‌కుమార్ గ్యాస్ ఏజెన్సీ యజమాని గుమెళ్ల రామకృష్ణను వివరణ కోరగా వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోకపోతే కనెక్షన్ల తొలగింపు అవాస్తవమని, రాయితీ మాత్రం పడదని చెప్పారు.